క్లుప్తంగా

త్యాగరాజస్వామి ఆలయంలో వసంతోత్సవం

కొలిమిగుండ్ల: స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన త్యాగరాజస్వామి ఆలయంలో గురువారం వసంతోత్సవం నిర్వహించారు. వారం రోజుల క్రితం ఆలయంలో త్యాగరాజస్వామి, సీతా, లక్ష్మణ,కోదండరామస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేదపండితులు ఆలూరి రాఘవేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం, వసంతోత్సవం నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

సేవాభావం అలవర్చుకోవాలి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వినియోగించాలని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి చెప్పారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెల అందజేసే పింఛన్ల ప్రక్రియను గురువారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున పింఛన్లు పంపిణీ చేశారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



తిమ్మప్ప దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండలంలోని ముద్దవరం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు తిమ్మప్ప పాఠశాల అభివృద్ధికి తన వంతుగా రూ. లక్ష విరాళం ఇచ్చారు. గురువారం గురుపూజోత్సవం సందర్భంగా ఆయన సేవలకు గుర్తింపుగా లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధు సూదన్‌రెడ్డి, రాజు, వలిబాషా, శేఖర్ తిమ్మప్ప దంపతులను ఘనంగా సన్మానించారు.

10న జాబ్‌మేళా

డోన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ డిస్క్, నవతా ట్రాన్స్‌పోర్ట్, ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్, డిక్షన్ టెక్నాలజీస్ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. 10వ తరగతి, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు సెల్ 7981238237 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చిరుధాన్యాల సాగుతో ఆదాయం



మాట్లాడుతున్న ఏడీఏ పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి

డోన్ రూరల్ : రైతులు చిరుధాన్యాల సాగుతో ఎక్కువ ఆదాయం వస్తుందని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో గురువారం మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏడీఏ మాట్లాడుతూ ఈ సంవత్సరం అధిక వర్షాలు రావడంతో కొర్ర పంటకు చీడపీడలు రావని, దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. కంది పంట మొదటి దశలో వేపనూనె పిచికారీ చేయాలని సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లు వేసిన వారిపై చర్యలు తప్పవు

ప్యాపిలి: మండలంలోని గ్రామాల్లో అక్రమంగా లేఅవుట్లు వేసిన వారిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కుడా నుంచి వచ్చిన జాబితా మేరకు ప్యాపిలిలో 326-1ఏ2, 326-1ఏ1, 330-1 సర్వే నంబర్లలో అక్రమ లేఅవుట్లు వేశారని పేర్కొన్నారు. కలచట్లలో 266-1,2,3,4, 243-ఏ2, 244-2, 244-1, 185 సర్వే నంబర్లలో అక్రమ లేఅవుట్లు వేశారని, సర్వే నంబర్లలో లేఅవుట్ వేసిన వారికి నోటీసులు ఇచ్చామన్నారు.

పథకాలు వర్తింపజేయాలి

బనగానపల్లె : అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో అంగన్‌వాడీ యూనియన్ సమావేశం నిర్వహించారు. కనీసవేతనం రూ.26 వేలు ఇచ్చి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శోభారాణి, నాయకురాళ్లు రోజారమణి, సరస్వతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం


బనగానపల్లె రూరల్ : నకిలీ విత్తనాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఫర్టిలైజర్స్ యజమానులు డీఏపీ ఇతర ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కాకుండా ఇష్టానుసరంగా పెంచేసి రైతుల నడివిరుస్తున్నట్లు ఆరోపించారు. డీఏపీ కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వడం లేదన్నారు. సుబ్బారెడ్డి, బాలకృష్ణ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహం.. పర్యావరణ హితం

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణానికి చేటు
- 7న వినాయకచవితి
- వాడవాడలా కొలువుదీరనున్న వినాయక ప్రతిమలు



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన వినాయక విగ్రహం



మట్టితో తయారుచేసిన వినాయకుని ప్రతిమ

డోన్: విఘ్న నాయకుడు..ఆదిదేవుడు.. సకల శుభాలు కలిగించేవాడు.. పలుపేర్లతో భక్తులతో పూజలుందుకుంటాడు వినాయకుడు. ఈనెల 7వ తేదీ నుంచి చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు భక్తులు ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశారు. మండపాల ఏర్పాటు, విగ్రహాలను గ్రామాలకు, మండపాలకు తరలించే పనుల్లో బిజీగా ఉన్నారు. అయితే విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కాకుండా మట్టి విగ్రహాలను పూజించాలని ప్రభుత్వం, పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలకు రసాయనాలతో కూడిన రంగులను వినియోగిస్తుండటంతో పర్యావరణానికి హానికరమని పేర్కొంటున్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసిన తరువాత జలాశయాల్లో టన్నుల కొద్ది వ్యర్థపదార్థాలు నిండిపోవడమే కాక భూగర్భ జలాలు, నీటి వనరులు కలుషితమైపోతున్నాయి. నీటిలో ఉండే జీవరాశులు మృత్యువాత పడుతున్నాయి. ఈ నేపథ్యంలో కాలుష్య నివారణ కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం జీవరాశుల సంరక్షణ కోసం ఎలాంటి హానికలిగించని ఏకదంతుడి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. కేవలం మట్టితోనే తయారుచేసే విగ్రహాలను ప్రతిష్ఠించి చెరువుల్లో నిమజ్జనం చేయడం ద్వారా సులువుగా నీటిలో అవి కరిగిపోగలవని చెబుతున్నారు. పంచభూతాల్లో ఒకటైన మట్టితో విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేస్తే మంచి ఫలితం ఉంటుందని వేద పండితులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఆలయాల్లో స్వయంభు దేవతలకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో మట్టితో చేసిన వినాకుడి ప్రతిమకు కూడా అంతే శక్తి ఉంటుందని పండితులు పేర్కొంటున్నారు. డోన్ నియోజకవర్గంలో సుమారు 20వేల విగ్రహాలు కొలువుదీరే అవకాశం ఉంది.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేటు..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే విగ్రహాలకు విషతుల్యమైన రంగులను అద్దుతున్నారు. వీటినే అనేక మంది వినాయకచవితి రోజు ప్రతిష్ఠిస్తున్నారు. వీటిని నిమజ్జనం రోజున చెరువులు, కుంటల్లో వేస్తే త్వరగా నీటిలో కరగడం లేదు. అలాగే.. నీరు కలుషితం కావడమే కాక చెరువులు, కుంటలు పూడికతో పేరుకుపోతున్నాయి. హానికరమైన రంగులు, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మూలంగా నీటిలోని జీవరాశులు మత్యువాతపడుతున్నాయి. ఇలాంటి చెరువుల్లో పెరిగిన చేపలను తినడం ద్వారా ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. కేవలం మట్టితో తయారుచేసిన విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లదు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. శుద్ధ జలాలు కూడా రసాయనాలతో కలుషితమై నీటిలోని సమస్త జీవరాశులు కనుమరుగవుతున్నాయి. ఇలాంటి విగ్రహాల తయారీ వల్ల జరిగే అనర్థాలు, దుష్ఫలితాల గురించి ప్రజలకు ముఖ్యంగా యువకుల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. మట్టి వినాయక విగ్రహాల ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నాం.

– సప్తశైల సుమిత్ర రాజేష్, ప్రకృతి ప్రేమికురాలు, హార్టికల్చర్ యూనివర్సిటీ సభ్యురాలు

ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు



మట్టితో వినాయకులను స్వయంగా ఇంట్లోనే తయారుచేసుకోవచ్చు. దీంతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుత వినాయక విగ్రహాల నిమజ్జనం వల్ల ఘన పదార్థాలన్నీ చెరువుల్లో పేరుకుపోతున్నాయి. జలాల్లోని జీవరాశుల ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను తయారుచేసుకోవాలి.

– వెంకటరెడ్డి, ఆర్‌డీఓ, డోన్

మానవాళి మనుగడకు ప్రమాదం



వినాయక చవితి సందర్భంగా రసాయనిక రంగులు అద్దిన విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయడం మంచి పద్ధతి కాదు. కేవలం మట్టితో చేసిన విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజలు చేసి నిమజ్జనం చేయాలి. చెరువులు, నీటికుంటల్లో నీరు కలుషితం కావడం వల్ల అవి సేవించిన వారికి, నీటిలోని జీవరాశులను ఆహారంగా తీసుకున్న వారికి అంతుపట్టని రోగాలు సంక్రమించే ప్రమాదం ఉంది. తద్వారా మానవాళి మనుగడకు పెనుప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

– డాక్టర్ మాధవకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, కర్నూలు సర్వజన ప్రభుత్వ వైద్యశాల

కోలుకోలేక వ్యక్తి మృతి

బేతంచెర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న రుద్రవరం గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు గురువారం తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ మనోహర్ (30) బుధవారం ఆటోలో వెల్దుర్తి నుంచి రుద్రవరం వస్తుండగా.. యంబాయి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న బోయ మనోహర్‌కు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి గురువారం తెలిపారు. మృతుడి తమ్ముడు నరసింహుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతుడికి భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్యాపిలి: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించడమే ధ్యేయమని ఏపీజీబీ జనరల్ మేనేజర్ గిరి, రీజనల్ మేనేజర్ వెంకటరమణ అన్నారు. గురువారం వారు స్థానిక ఏపీజీబీ శాఖలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం బ్యాంకు లావాదేవీల గురించి మేనేజర్ సతీష్‌రెడ్డి, ఫీల్డు ఆఫీసర్ జగదీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఇతర బ్యాంకులతో పోలిస్తే తమ ఖాతాదారులకు డిపాజిట్లపై 8.30 శాతం వడ్డీ ఇస్తున్నామని చెప్పారు. ప్రగతి ప్రీమియం కరెంట్ ఖాతాలపై నగదు నిర్వహణకు చార్జీలు ఉండవన్నారు. ట్రేడర్లు, ట్రస్టులు, వ్యాపారులు ప్రగతి ప్రీమియం కరెంట్ ఖాతాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరద బాధితులకు విరాళం

డోన్ రూరల్ : విజయవాడ వరద బాధితుల కోసం డోన్ నుంచి ఏఐవైఎఫ్ నాయకులు విజయ్, శ్రీకాంత్, సూర్యప్రతాప్ గురువారం వాటర్ బాటిళ్లను పంపారు. వారు మాట్లాడుతూ మెకానిక్ హరి సహకారంతో వాటర్ బాటిళ్లను విరాళంగా3 అందజేశామని చెప్పారు.

ఆదర్శనీయులు సర్వేపల్లి

- ఉపాధ్యాయ దినోత్సవంలో వక్తలు
- బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో ఘనంగా వేడుకలు



కోవెలకుంట్ల ప్రభుత్వ పాఠశాలలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



కొలిమిగుండ్ల: రాధాకృష్ణన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



రిటైర్డు ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రభుత్వ పెన్షనర్లు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ భారత మాజీ రాష్ట్రపతి దివంగత సర్వేపల్లి రాధాకృష్ణన్ అడుగు జాడల్లో నడవాలని కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజయ్య అన్నారు. సర్వేపల్లి జయంతిని పురస్కరించుకుని గురువారం బనగానపల్లె నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా సర్వేపల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటుండటం హర్షణీయమన్నారు. అలాగే కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ అబ్దుల్ జబ్బార్ మాట్లాడుతూ విద్యార్థులు సర్వేపల్లిని ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగు జాడల్లో నడవాలని సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

➡ కోవెలకుంట్ల పట్టణంలోని వాసవి బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు.

కొలిమిగుండ్ల: విద్యాభివృద్ధి కోసం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన కృషి ఎనలేనిదని యర్రగుడి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి అన్నారు. గురువారం పాఠశాలలో సర్వేపల్లి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రముఖ రచయితల్లో సర్వేపల్లి ఒకరన్నారు.ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ప్యాపిలి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యంను, లెక్చరర్లను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించి పాఠాలు చెప్పి ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు ఆటల పోటీలు నిర్వహించి సంతోషంగా గడిపారు.

డోన్: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆ సంస్థ కార్యాలయం నందు పదవీ విరమణ పొంది 75 ఏళ్లు పూర్తిచేసుకున్న రిటైర్డు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కళారత్న, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ, రిటైర్డు ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, జయరాముడులను రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు భానుసింగ్ ఆధ్వర్యంలో పెన్షనర్లు పట్టుశాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

బేతంచెర్ల: విద్యార్థుల జీవితాల్లో చీకట్లు తొలగించి వెలుగులు నింపేవారు గురువులని వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, వెంకటరమణ , సురేంద్ర అన్నారు. గురువారం స్థానిక అమ్మవారిశాలలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ప్రసన్న, సుశీలను వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అలాగే.. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ప్రాథమిక పాఠశాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి సైన్స్ విజ్ఞాన మేళాను నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ మాట్లాడారు. విద్యార్థులు గోబర్ గ్యాస్, చెత్త సంపద కేంద్రాలు, రైల్వే లైన్లు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ తదితర ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు పారిశ్రామిక వేత్త గౌరి హుసేన్‌రెడ్డి సహకారంతో మెడల్స్ అందజేశారు.

డోన్ టౌన్ : సమాజంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో గొప్పదని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఫొటోగ్రాఫర్స్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు న్యాయవాది నాగభూషణం రెడ్డి అన్నారు. గురుపూజోత్సవం దినోత్సవాన్ని పురస్కరించుకొని పాతపేట జెడ్పీ హైస్కూల్లోని ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సత్కరించారు.

బనగానపల్లె : ప్రతి ఒక్కరి విజయం వెనుక గురువు పాత్ర తప్పనిసరిగా ఉంటుందని పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బాలగంగధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బీసీ రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వరూప, ఆర్యవైశ్య సంఘం నాయకులు శీనయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం పక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండలంలో ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈఓ1 రాజయ్య, ఎంఈఓ 2 ఈశ్వరయ్యను మండల ఉపాధ్యాయులు సత్కరించారు. సంజామల ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం శంకర్, కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అరుణకుమారి, గిద్దలూరు పుస్తక సంక్షిప్త కేంద్రం నిర్వాహకులు మద్దిలేటి ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి నివాళులర్పించారు.

డోన్ టౌన్ : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే విగ్రహానికి బీసీ సంఘాల నాయకులు గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలోని పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

డోన్ టౌన్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు సంఘాల నాయకులు ఉపాధ్యాయులను సత్కరించారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తొగట సురేష్‌బాబు,సర్వజ్ఞమూర్తి,చిన్నపరెడ్డిని సత్కరించారు. పాతపేట జెడ్పీ హైస్కూల్లో యూటీఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి,జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎంఈఓ రామనర్సప్ప ఉపాధ్యాయులను సత్కరించారు.

పోషకాహార లోపంతో మాతాశిశు మరణాలు



పోషకాహార అవశ్యకతను వివరిస్తున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

బనగానపల్లె రూరల్: పోషకాహారలోపంతో మాతాశిశు మరణాలు సంభవిస్తాయని మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ ఆధ్వర్యంలో పోషణ్ మహా కార్యక్రమం జరిగింది. టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు మాట్లాడుతూ బాలింత, గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలతో కూడిన పౌష్టకాహం తీసుకోవాలని ,పుట్టిన బిడ్డకు తల్లిపాలనే ఇవ్వాలన్నారు. తల్లి పాలలో అనేక పోషక విలువలు ఉండడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, జమీలా, శైలజ, సాలమ్మ, చిట్టమ్మ, శాంత, శివమ్మ, చంద్రమ్మ, పద్మావతి, పావని, సుగుణ అంగన్‌వాడీ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ నిర్మాణ పనులు చేపట్టాలి



డీఆర్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

డోన్: పట్టణంలో రెండు ప్రధాన రైల్వేగేట్ల మూలంగా ఏర్పడిన ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పెండింగ్‌లో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జిని నిర్మించేందుకు చొరవ చూపాలని డోన్ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ విజయ్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు ఆయనను కలిసి సమస్యను వివరించారు. వారు మాట్లాడుతూ.. టెండర్ ప్రక్రియ పూర్తయి అండర్ పాస్ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. రోజూ పదుల సంఖ్యలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు, గూడ్స్ వ్యాగిన్లు తిరుగుతుండటం మూలంగా గేట్ల వద్ద ప్రయాణికులు, పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు గంటల కొద్దీ నిలిచిపోవాల్సి వస్తుందన్నారు. కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, రైల్వే నాగేంద్ర, వెంకట్రాముడు, సుంకన్న, కటిక వేణు, మిట్టా ఉమామహేశ్వరి, పూజారి వెంకటేశ్వరమ్మ, బోయ కళావతి, మౌలాబీ, ఫాతిమాబీ, మాజీ కౌన్సిలర్లు మిట్టా రవి, ధారా ప్రతాప్‌రెడ్డి, మేకల నాగరాజు, అంగడి పెద్దయ్య ఉన్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE - PULIVENDLA
O.S.NO 177 /2022
Bathala Nagendra Kumar, s/o Chinna Veerappa alias Veeranna r/o Kappagal Road, opp Masjid, M.V.Nagar, 9th cross Right side, Ballary town & Mandal. **Plaintiff**
Vs
1. Bathala Veerendra Kumar, son of Chinna Veerappa alias Veeranna , r/o C/o Challa Sunkanna, H.No. 2-47, Garladinne village, & post, peapully, Madhavaram, Kurnool dist.
2. Bathala Shobha Rani w/o late Bathala Brahmendra Kumar, r/o Rayalam Towers, plot No.325, Jaahar Nagar, MOULALI Hyderabad-500040 Telangana State **Defendants 1& 2**
నోటీసు
... Plaintiff ప్రతివాదులు/ Defendants పై O.S. NO 177/2022 ... 25-09-2024 ... 25-09-2024 వ తేదీన ఉదయము 10-30 గం // లకు ...
// By Order of the Court //
N. LAKSHMI NARASIMHULU B.A; B.L.
Advocate , Pulivendla

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



బనగానపల్లెలో కార్యదర్శులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ ఆఫీసర్ మంజులవాణి



కోవెలకుంట్ల: కుందూనది వద్ద విగ్రహాల నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బనగానపల్లె రూరల్: అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ ఆఫీసర్ మంజులవాణి ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జీ ఎంపీడీఓ నాగరాజు ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు, గ్రామాల్లో పరిశుభ్రతపై తీసుకోవాల్సిన చర్యల పై ఆమె సమీక్షించారు.ఈ సందర్భంగా మంజులవాణి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు,కుంటల్లో నీరు ఎక్కువగా ఉందన్నారు.నిమజ్జన సమయంలో వాటి వద్ద ప్రమాదా లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల వద్ద ప్రత్యేక గజ ఈతగాళ్లను పంచాయతీ తరఫున ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే గ్రా మాల్లో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి పరిశుభ్రత కార్యక్రమాలు, ట్యాంకుల క్లోరినేషన్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం పట్టణ శివారులోని కుందూనది వద్ద వినాయక నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో మూడు రోజులకు, మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఐదు రోజులకు వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం ఉంటుందన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి నీటిని విడుదల చేయడంతో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. నిమజ్జన సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ గోపీనాథ్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్యాపిలి: కురుస్తున్న వర్షాలకు టమాట పంట దెబ్బతిన్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మహానంది ఉద్యాన పరిశోదన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఠాగూర్ నాయక్, నంద్యాల జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు సూచించారు. మండల పరిధిలోని పెద్దపొదిళ్ల, ప్యాపిలి, పోతుదొడ్డి తదితర గ్రామాల్లో దెబ్బతిన్న టమాట పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఫ్రెంచ్ చిక్కుడు పంటతో పంట మార్పిడి చేస్తే బ్యాక్టీరియా, ఎండు తెగులు తగ్గుతుందన్నారు. ఆవాలు, బంతి, ఇతర ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేస్తే నులిపురుగుల ఉధృతి తగ్గుతుందన్నారు. ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి ఉన్నారు.

చవితిని ప్రశాంతంగా జరుపుకోండి

కోవెలకుంట్ల: మండలంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కోవెలకుంట్ల, రేవనూరు పోలీసు అధికారులు, మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వినాయక విగ్రహాలను కొలువుంచేందుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. నిమజ్జన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకోవాలని పేర్కొన్నారు. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఆర్ఐ ఇమ్రాన్, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించండి

బేతంచెర్ల: రంగు, రంగుల వినాయకుల వల్ల కలిగే పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండాగోపాల్, బచ్చు సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం కందగడ్డల జనార్ధన్, విష్ణు, సుధీర్ ఆధ్వర్యంలో గుండా జగన్ సహకారంతో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో 350 మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కందగడ్డల రామూర్తి, లక్ష్మీనారాయణ, గణేష్, శ్రావణ్, సురేంద్ర, సురేష్, సుబ్బయ్య గుప్త పాల్గొన్నారు.

